విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదులపై విచారణ పారదర్శకంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు పాటించి నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాల ఫిర్యాదులను ఈనెల 26వ తేదీలోపు విచారణ చేసి పరిష్కరించి జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధన లను అనుసరించి ఫిర్యాదుల విచారణ చేసి పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరును తొలగించకుండా చూస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాల విషయమై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఈ విషయమై రాజకీయ పార్టీల నాయకులు కూడా యువకులకు తెలియజేయాలన్నారు. 18 ఏళ్ళు నిండిన వారితో పాటు 17 ఏళ్ల వయస్సు కలిగిన వారు కూడా ప్రోగ్రెసివ్ ఓటర్లుగా నమోదు కావచ్చునన్నారు. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ ఒకటవ తేదీ ప్రాతిపదికగా 18 ఏళ్ళు నిండగానే ఓటరుగా నమోదు అవుతారన్నారు. ఓటు హక్కు పొందడం, వినియోగించుకోవడం పై అవగహన పెంచుకోవడంతో పాటు మిగిలిన వారిలో కూడా అవగాహన, చైతన్యం కల్పించాల న్నారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోడే యుగంధర్ వైయస్సార్సీపి, మరపట్ల శ్యాంబాబు టిడిపి, తమలంపూడి వంశీ శ్రీనివాస రెడ్డి కాంగ్రెసు, కాటూరి కరుణాకర్ బిఎస్పీ, జెయన్ వి. గోపాలన్ సిపియం, ఎలక్షన్ తహాశీల్దారు వై. దుర్గా కిషోర్, ఎలక్షన్ డిప్యూటీ తహాశీల్దారు యం. సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్మాణం ఆలస్యానికి చంద్రబాబే కారణం

విశాలాంధ్ర-తణుకు: గత ప్రభుత్వం చంద్రబాబు హయాంలో 5.36 శాతం ఉన్న వృద్ధి రేటు, వైసిపి ప్రభుత్వం జగన్ హయాంలో వృద్ధిరేటు 11.27 శాతం ఉందని రాష్ట్ర పౌరసరఫరాల వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ స్కాం అవినీతి చేసి జైలుకెళ్ళి బెయిల్ పై వచ్చిన చంద్రబాబు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే స్థాయి వైకాపాది కాదన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకి ప్రత్యేక హెూదా గురించి మాట్లాడే అర్హత లేదని,ఆనాడు ప్రత్యేక హెూదా వద్దు ప్యాకేజి ముద్దు అని హెూదా అంశాన్ని అటకెక్కించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. పోలవరం పూర్తికాకపోవడానికి కూడా చంద్రబాబే కారణమన్నారు. పోలవరంలో ఏమీ చేయకుండా అంతా చేసేసానని జనాన్ని తీసుకెళ్లి భజన చేయించిన బాబుకి పోలవరం పేరెత్తే అర్హత లేదన్నారు.

ప్రజలకు మేలైన సేవలు అందించాలి

విశాలాంధ్ర - పెంటపాడు : ప్రజలకు మేలైన సేవలు అందించాలని మండల అభివృద్ధి అధికారి సిహెచ్.బాలాజీ వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక మండల మండల పరిషత్ సమావేశ హాలులో, గ్రేడ్-1, గ్రేడ్-4 కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్.బాలాజీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందే విధంగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంక్షేమ పథకాలు పరువులు అందరికీ అందే విధంగా చర్యలు చేపడుతూనే, ఇంకా అర్హులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, సంక్షేమ ఫలాలు పేదలందరికీ అదే విధంగా ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య, వారదులుగా కార్యదర్శులు అండగా ఉండాలన్నారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశం ముగిసిన అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి, సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. మండల విద్యాశాఖ అధికారి టివి రామకృష్ణ, ఇన్‌చార్జి ఈఓపిఆర్డి సిహెచ్ చక్రవర్తి, ఎండిఓ తో పాటు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు,జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు శనివారం వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని, ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, ఫ్రీస్కూల్స్ బలోపేతం చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లో నిబంధనలు పాటించి ప్రమోషన్ వయస్సు 50 సంవత్స రాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి జోనుబోయిన సోంబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి సాయి,మద్యాహ్నపు చిన పెంటా రావు, తోట సాయి, ఆళ్ళ బాలాజీ, దాసరి పుల్లా రావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరావు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం పట్టణ అభివృద్ధికి తన తోడ్పాటును కల్పించి, కోట్లాది రూపాయలు విలువ చేసే తన సొంత స్థలాలైన, ప్రభుత్వ ఆసుపత్రి స్థలం, హై స్కూల్, జూనియర్ కళాశాల స్థలం, పోలీస్ స్టేషన్ స్థలాల దాత కొల్లూరి విశ్వేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని కొయ్యలగూడెం పట్టణంలో ఏర్పాటు చేస్తామని పంచాయతీ ఎన్నికలలో వాగ్దానం చేసిన సర్పంచ్, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కొయ్యల గూడెం పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో ఒక కులానికి చెందిన నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి వారి కుల నాయకుడు విగ్రహాలను పట్టణంలో జాతీయ రహదారిని ఆనుకుని రెండు చోట్ల వేరువేరుగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. కొయ్యలగూడెం పట్టణ అభివృద్ధికి గ్రామంలో ఎవరు సహరించకపోయినా గ్రామం అభివృద్ధి చెందితే అందరికీ ఉపయోగం ఉంటుందని మంచి ఆలోచనతో కోట్లాది రూపాయలు విలువ చేసే తన సొంత స్థలాలను ప్రభుత్వానికి దానం చేసిన కొల్లూరి విశ్వేశ్వరరావు విగ్ర హాన్ని పెట్టడానికి మాత్రం గ్రామ పెద్దలు, వ్యాపారులు , ఆర్యవైశ్య సంఘం వారు, పంచాయతీ ఎన్నికలలో హామీ ఇచ్చిన గ్రామపంచాయతీ సర్పంచ్ కూడా ముందుకు రావడం లేదని అన్నారు. కొల్లూరి విశ్వేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

ప్రజా కంటక పాలకులను గద్దె దింపండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో మండల సమితి సమావేశం జమ్మి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రధాని మోడీ నాటి ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులను మోసం చేశారని విమర్శించారు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో రైతులు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడం లో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. రైతులు అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి ఆరుగాలం శ్రమించి పెట్టుబడి పెడితే నేడు తుఫాను ప్రభావంతో తీవ్ర నష్టాలలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా కల్పించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నివేదిక అంచనా వేసి జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్రాన్ని నిధులు అడగడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శిం చారు. తక్షణం ప్రభుత్వం స్పం దించి రూ.1000కోట్ల సాయం అందించాలని, పూర్తి పరిహారం రూ.10 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం నిమిత్తం అంగ న్వాడీలు గత ఐదు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చేష్టలుడికి చూస్తున్నదని, ఇతర సిబ్బందితో తాళాలు పగలగొట్టి అంగన్వాడి కేంద్రాలు నడపాలని చూడటం దుర్మార్గం అన్నారు. రాబోయే ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సిపిఐ శ్రేణులు గ్రామ శాఖలను బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో వ్యసాయ కార్మిక జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల ఏసు, మండల సహాయక కార్య దర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్య దర్శి షేక్ బాజీ, లక్క లక్ష్మణరావు, దుగ్గిరాల. నారాయణరావు, గుడే శ్రీను, జక్కుమంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తుల వర్క్ షాపు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిన్ బి. కృష్ణమోహన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయ మూర్తులతో వర్క్ షాప్ నిర్వహిం చారు. శనివారం జిల్లా రెవిన్యూ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న న్యాయమూర్తి బి. కృష్ణమోహన్‌కు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమకుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి. రామ్ గోపాల్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, ఉమ్మడి పశ్చిమగోదావరి న్యాయమూర్తులు ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ సభ్యులు బి.వి. కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులు ఎ. విజయ్ కుమార్, రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులతో ఏర్పాటు చేసిన వర్క్ షాపులో రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి. కృష్ణమోహన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమ కుమార్, తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి. శివశంకరరావు తో కలిసి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో క్రిమినల్ కేసులలో వాస్తవ ఔచిత్యము ఒక అవలోకనం, సెక్షన్-1 విజయాలు, ప్రేరణ తయారీ, ప్రవర్తనయొక్క ఔచిత్యము, పరీక్ష గుర్తింపు కాలాలు, అలీబీ, సెక్షన్ల-2 క్రిమినల్ కేసుల్లో అడ్మిషన్లు, కన్ఫెషన్స్ ఔచిత్యము, సహ నిందితుల ఒప్పుకోలు తదితర అంశాలపై వర్క్ షాప్‌లో వివరించారు. ఈ వర్క్ షాప్ లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ బి. వసంతలక్ష్మి, పి. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ జిల్లా జడ్జి ఎవి పార్థసారథి (రిసోర్స్ పర్సన్స్) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

27 నుండి నిరవధిక సమ్మె

ఎ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర -భీమవరం: అపరిష్కృత డిమాండ్లు నెరవేరని పక్షంలో ఈ నెల 27నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఎ.పి. మున్సపల్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర కార్యదర్శి కిలారి మల్లేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కార్య వర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలకు శనివారం సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మునిస్పల్ కార్పోరేషన్లో పనిసేస్తున్న ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్ట్, ఆఫ్కస్, ఇంజినీరింగ్ శాఖ కార్మికులు, ఉద్యోగస్తులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు.కార్మికుల దీర్ఘ కాలిక సమస్యలు పరిక్షరించాలని, జి. ఓ. నెంబర్ 151 అమలుసేసి 26000 రూపా యలు వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలపు శ్రీను, ఆశీర్వాదం, రెల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

రామకోటయ్య రాకతో అనూహ్య రాజకీయ పరిణామాలు

గెలిచే అభ్యర్థిగా రామకోటయ్యకు గుర్తింపు

విశాలాంధ్ర -చాట్రాయి : నూజివీడు నియోజకవర్గంలో ఉన్న ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో గడచిన 55 రోజుల క్రితం తాను మరో సారి ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నాను అని నూజివీడు మాజీ శాసన సభ్యులు చిన్నం రామ కోటయ్య ప్రకటించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో ఇటీవల చేసిన ఒక సర్వేలో రామకోటయ్యను గెలిచే అభ్యర్థిగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం రిపోర్టు ఉండటం గమనార్హం అని పలువురు అంటున్నారు.

వైయస్సార్ పార్టీ తరపున గడచిన రెండుసార్లుగా గెలుస్తున్న ప్రస్తుత శాసనసభ్యులు ప్రతాప్ అప్పారావు ఒక్కరే కాగా తెలుగు దేశం పార్టీలో మాత్రం నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఇటీవల తెలుగుదేశం పార్టీలో ఒక ఊపు ఊపిన యువ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త పర్వతనేని గంగాధర్ అట్లూరి రమేష్‌ల పేర్లు పరిశీలనలో ఉండగా మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్యకు సీటు ఇస్తే గెలిచే అవకాశం ఉందని టిడిపి అధిష్టానం లో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం జరిగిన శాసనసభ ఎన్నికలలో ప్రజారాజ్యం తరపున రాజకీయ రంగ ప్రవేశం చేసి తెలుగుదేశంలో సీటు సంపాదించి ఎమ్మెల్యే సీటును కైవసం చేసుకున్న చరిత్ర ఉన్న వ్యక్తి చిన్నం రామకోటయ్య. వైఎస్ఆర్ సీపీకి కంచుకోట అయిన చాట్రాయి మండలంలో మాజీ ఎంపీటీసీలను ముఖ్యమైన నాయకులను రామకోటయ్య తో కలిసి పని చేస్తున్నారు. చాప కింద నీరులా నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ను నూజివీడు పట్టణంలోను సాధారణ ప్రజలను నాయకులను కార్యకర్తలను రామకోటయ్య ఆకట్టుకుంటున్నారని పలువువు అంటున్నారు.

అంగన్వాడీల సమ్మె ఐదవ రోజు ఉధృతం

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి నూజివీడు లో ఐదవ రోజు సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రక్కన నిరవధిక సమ్మె కొనసాగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వం దిగి వచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడి కేంద్రాలలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ నూజివీడులో అన్నిచోట్ల తాళాలు పగలగొట్టదాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టీఏ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవు సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా అధ్యక్షురాలు ఆర్. క్రిస్టియన్ అమ్మ, జిల్లా నాయకురాలు సిహెచ్ విజయదుర్గ, ఆర్ విజయలక్ష్మి, సిఐటియు అంగన్వాడి నూజివీడు ప్రాజెక్టు అధ్యక్షులు ఏదిరేసి.ఆదిలక్ష్మి, మణి, పద్మ, వసుంధర, జ్యోతి, విజయలక్ష్మి, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా వేలేరుపాడు అంబేద్కర్ సెంటర్లో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం కోసం కమిటీలంటూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీలో ఉన్న మంత్రులకు అంగన్వాడి సమస్యలపై కనీస అవగాహన లేదని వాపోయారు. చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో వ్యయ ప్రయాసలు ఓర్చి పనులు చేస్తున్నారని దాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వేతనం పెంచకుండా, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అంగన్వాడీలను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి కనీసం వారి గురించి పట్టించుకోకపోవడం చాలా దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల రాష్ట్ర కమిటీ సభ్యులు కౌలురి సైదా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, సిపిఐ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి బాడిస రాము కారం ధారయ్య, సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు,సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, అంగన్వాడి యూనియన్ నాయకులు చందా రమాదేవి, లత, వెంకటలక్ష్మి, లీలావతి, పిట్ట రమాదేవి, తదితరులున్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు ఏఐటీయూసీ మద్దతు

విశాలాంధ్ర - ఏలూరు : గత ఐదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ, సిఐటియు, ఐఎఫ్టియు అనుబంధ అంగన్వాడి వర్కర్స్, ఆయాల సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మెకు శనివారం ఏలూరులో ఏఐటియుసి నాయకత్వం సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఐదు రోజులుగా అంగన్వాడి వర్కర్లు ఆయాలు సమ్మె చేస్తున్న సమ్మె పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసు కోక పోవడం చాలా అన్యాయమని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే ,జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, అంగన్వాడీ వర్కర్స్, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మినీ అంగన్వాడి కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలుగా పరిగణించాలని, అంగన్వాడి వర్కర్స్ కు పదవి విరమణ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటి రూ.5 లక్షలు చెల్లించాలని, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ మే గ్యాస్ ను ఉచితంగా అందించాలని, అద్దె భవనాలలో ఉంటున్న అంగన్వాడీ కేంద్రాలకు చెల్లించవలసిన అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్ల, ఆయాల న్యాయ మైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు అంగన్వాడి వర్కర్ల ఆయాల సంఘాలు చేస్తున్న సమ్మెకు ఏఐటియుసి సంపూర్ణ మద్దతు సంఘీభావం ఉంటాయని శ్రీనివాస డాంగే ,వెంకటేశ్వరరావు, అప్పలరాజు తెలిపారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన వారిలో ఏఐటియుసి నాయకులు కే లోమి, గేదెల నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. టి నరసాపురం తహాశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు చేస్తున్న నిరసనకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అంగన్వాడీ వర్కర్స్ పై అనుసరిస్తున్న వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండించారు. జగన్మోహనరెడ్డి ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వం అందరికీ ఇచ్చే రాయితీలు అంగన్వాడీ వర్కర్స్ కూడా అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట సమితి నాయకులు గదుల సత్యనారాయణ, శెట్టి నాగ బాలాజీ ,మారిశెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

దోష రహిత ఓటర్ల జాబితా

రాజకీయ పక్షాల సమావేశంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో పారదర్శకంగా దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పక్షాల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిర్రా భరత్(బిఎస్పీ), పి.ఆదిశేషు(సిపిఎం), ఎస్. బాబూ ప్రసాద్(కాంగ్రేస్), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ(వైఎస్ఆర్ సిపి) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల నిర్వహణలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదనే ప్రధాన ఉద్దేశ్యంతో ప్రతివారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తప్పులులేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సహకారం అందించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని సంబం ధిత ఇఆర్ఓ, ఏఇఆర్ఓల ద్వారా పరిశీలించి ఎక్కడ తక్కువగా ఉందో గమనించి ఓటింగ్ శాతం వృద్ధిపరిచే ప్రణాళికను తయారు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో అక్టోబరు 28 నుంచి డిశంబరు 9వ తేదీ వరకు ఫారం-6,7,8 ద్వారా లక్షా 26 వేల 681 ధరఖాస్తులు రాగా ఇంతవరకు 99 వేల 826 పరిష్కరించినట్టు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏమైనా సమస్యలువుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయపార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అకాల మరణం బాధాకరం

సమావేశానికి ముందు ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అకాల మరణానికి సమావేశం సంతాపం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అకాల మరణం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తెలుగు సాహిత్య కళాఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి శ్రీశ్రీ కళావేదిక తెలుగు సాహిత్య అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఆంధ్ర రాష్ట్ర సాహితీ అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి , మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి పాల్గొన్నారు. కళావేదిక అధ్వర్యంలోప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు - తెలుగు భాష సాంస్కృతిక ప్రదర్శనలు లో భాగంగా వివిధ కళాకారులతో నిర్వహించిన ర్యాలీలో వాణీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడేటట్లుగా తెలుగు తల్లి ,భరతమాత ,రాణి రుద్రమదేవి, మొల్ల ,కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన వంటి కవుల వేషధారణలతో పాల్గొనడం పట్టణంలోని పలువురి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

అంగన్వాడీల హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏలూరు జిల్లా తెలుగు దేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రమైన గణపవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న నిరసనకు తెలుగుదేశంపార్టీ తరపున మద్దతు తెలిపారు.అంగన్‌వాడీల కష్టాలు గుర్తించింది చంద్రబాబు నాయుడేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణం రాజు, గణపవరం పట్టణ అధ్యక్షులు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు, కాపవరం చిన్న, గొర్లి వాసు, పెద్దిరాజు, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈ వార్తను తప్పనిసరిగా ఫోటోతో పెట్టగలరు ఎమ్మెల్యే గారు యాడ్ ఇచ్చారు

విద్యావ్యాప్తికి మూర్తి రాజు కృషి వెలకట్టలేనిది

విశాలాంధ్ర - నిడమర్రు: గాంధేయ వాది, విద్యా దాత, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు విద్య వ్యాప్తికి ఆయన చేసిన కృషి వెలకట్టలేమని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు.శనివారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను గాంధీ భవనంలో మూర్తి రాజు 104 వ జయంతి సందర్భంగా మూర్తి రాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూర్తి రాజు ఆశయాలకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముగ్గళ్ళ యాకోబు, సంకు సత్య కుమార్, వెజ్జు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మానవతామూర్తి మూర్తిరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: మాజీ మంత్రి, విద్యాదాత, గాంధేయ వాది చింతలపాటి రామచంద్ర వరప్రసాద్ మూర్తి రాజు పేదలపాలిటి పెన్నిదని మానవత పూర్తిగా తన జీవితాన్ని గడిపారని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం మూర్తి రాజు 104వ జయంతి సందర్భంగా నిడమర్రు మండలం పెదనింద్రా కొలను గ్రామం గాంధీ భవనంలో ఉన్న మూర్తి రాజు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చింతలపాటి బాసి రాజు, పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర -నరసాపురం: గత ఐదు రోజులుగా సమ్మె బాట పట్టిన అంగన్వాడీల ఆందోళనకు ఎట్టకేలకు అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే స్పందించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి మీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హామీ ఇచ్చారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ దీక్ష చేస్తున్న శిబిరాన్ని ముదునూరు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆయనకు గుర్తు చేశారు. స్పందించిన ప్రసాద్‌రాజు మీ సమస్యల పరిష్కారం తన స్థాయిలో లేదని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సాబ్జీకి నివాళులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉద్యోగ, కార్మిక, సమస్యలపై పోరాడుతున్న మహోన్నత వ్యక్తి ఎం.ఎల్.సి. సాబ్జి అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు పేర్కొన్నారు. అంగన్వాడి ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరాహార దీక్ష ఐదో రోజు చేరుకోవడంతో శనివారం దీక్ష శిబిరం వద్ద అంగన్వాడి ఉద్యోగులంతా కలిసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎం.ఎల్.సి సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంతాపం తెలియజేశారు. అనంతరం అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, 26 వేల రూపాయలు వేతనాన్ని అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి,మాధవి,జ్యోతి, చిట్టి తల్లి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే విధంగా విద్యార్థులు తయారవ్వాలని తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతా రామాంజనేయ చౌదరి పేర్కొన్నారు. మండలంలో సరిపల్లి గ్రామంలో ఉన్న ఎం వి ఆర్ పాఠశాలకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, తాన బుక్ ఆఫ్ రికార్డ్,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన సందర్భంగా సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీతా రామాంజనేయ చౌదరి ఎంవిఆర్ పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అనంత శ్రీరామ్ మాట్లాడుతూ మన అందరం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదగగలమో, ఆ తరువాత మనకు చేయూతను అందించేది మాత్రం విద్యను అందించిన గురువేనని ఆయన అన్నారు.వీరు ఇరువురు కలిసి విద్యార్థులకు పలు సూచనలను ఇచ్చారు.అనంతరం గారపాటి సీతారామాంజనేయ చౌదరిని, అనంత శ్రీరామ్ ను, ఎల్ ఆర్ కృష్ణ బాబును, విద్యాసంస్థల చైర్మన్ కాకి నాగ వెంకటరత్నం ను, కాకి వరలక్ష్మి లను, ఘనంగా సన్మానించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల కిషోర్ ,వివేకానంద, బాల%శీ% నరేష్, కే అంచల తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళన

విశాలాంధ్ర-కాళ్ల : అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెకు వెళ్తామని కాళ్ల మండల విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు . వేలాది మందితో విజయవాడలో ధర్నా నిర్వహించినా ప్రభుత్వంలో ఎటువంటి మార్పు లేదని తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్తున్నామని వారు తెలియజేశారు. పెన్ డౌ న్ చేస్తావని, డిసెంబర్ 20 నుండి నెల వరకు సమ్మెలో పాల్గొంటామని తెలియజేశారు. తమ న్యాయమైన కోర్కలైన , జీతాల పెంపు,బకాయిల చెల్లింపు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కనకరాజు ఎంఈఓ2కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మోహన్, అకౌంటెంట్ రోహిణి,సి ఆర్ పి లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొడుతున్న ఐ.సి.డి.ఎస్ అధికారులు

విశాలాంధ్ర-పెనుగొండ: ఈనెల 15వ తేదీన ప్రారంభమైన రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టే పని శనివారం కూడా కొనసాగింది. ఈ మేరకు సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఓ శ్రీనివాస్ దొర, తహసీల్దార్ ఎస్. గురుమూర్తి రెడ్డి తో అంగన్వాడీల పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టే అమానుషమైన చర్య ఆపాలని డిమాండ్ చేశారు. పెనుగొండ మండలంలో తామరాడ లో 2 సెంటర్లు, మునుమర్రు గ్రామాల్లో పగలగొట్టారని తెలిపారు. నిలుపుదల చేసే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తాళాలు అడిగి తీసుకోవాలని మాత్రమే ఐసిడిఎస్ సంస్థకు బాధ్యత అప్పగించారని, తాళాలు పగలగొట్టాలని చెప్పలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై డ్రాయింగ్ , వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - భీమడోలు: అవసరమైన మేరకు మాత్రమే విద్యుత్తును వినియోగించుకుంటూ విద్యుత్ పొదుపుకు ప్రతిఒక్కరూ సహకరించాలని భీమడోలు ఏడీఏ గోపాలకృష్ణ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా భీమడోలు హైస్కూల్ విద్యార్థులకు ఇంధన పొదుపుపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను ట్రాన్స్ కో అధికారులు నిర్వహించారు. పోటీలను ఏడీ గోపాలకృష్ణ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగ పొదుపుకు ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఎల్ఈడి బల్బులు, స్టార్ రేటింగ్ గల విద్యుత్ పరికరాలు వినియోగించాలని ఏడీ కోరారు.కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఏఈ రామస్వామి, ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

విశాలాంధ్ర-వీరవాసరం: అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.స్థానిక బస్టాండ్ సెంటర్లో 5వ రోజు నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు వాసుదేవరావు, సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, జన సేన ఎంపిటిసిలు మౌనిక, విజయలక్ష్మి, వెంకటలక్ష్మిలు మద్దతు తెలిపి మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాల పెంపుపై జగన్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని, అంగన్వాడీ కార్మికుల సమ్మె విచ్ఛిన్నకర చర్యలు రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి. నాగరత్నం, నిర్మల, లక్ష్మీ, వెంకటలక్ష్మి, శాంత కుమారి, నాగ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాల పెంపు తెదేపా పాలనలోనే

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : అంగన్వాడి కార్యకర్తలు తమ వేతనాలు పెంచాలని 5రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలకు టిడిపి యువ నాయకులు బొమ్మాజీ అనిల్, పలువురు తేదేపా నేతలు సంఘీభావం తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న శిబిరాన్నిమాజీ శాసనసభ్యులు గంటా మురళి రామకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శ్యామ్ చంద్రశేషు మండల పార్టీ అధ్యక్షులు సాయిల సత్యనారాయణ , టౌన్ పార్టీ అధ్యక్షులు రావూరి కృష్ణ,రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి ఆకుమర్తి రామారావు తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులతో కలిసి అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ మాట్లాడుతూ అంగన్ వాడీల ఆందోళన న్యాయబద్ధం అని పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా ఏపీటిఎఫ్-1938 జిల్లా నూతన కార్యవర్గం

విశాలాంధ్ర -భీమవరం: ఏపీటిఎఫ్-1938 పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులుగా బి.ఓం ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా పి.వి.ఎస్.ఎస్.బి. రమణా రావు, గౌరవ అధ్యక్షులుగా బి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా టీడీకే మహనీయం, పెద్దాడ రాజేశ్వరరావు, కార్యదర్శులుగా ఎస్.నిరీక్షణ, పి.నాగరాజు బి.ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో శనివారం నూతన జిల్లా ఆడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎన్నికల పరిశీలకులు ఏపీటిఎఫ్-1938 రాష్ట్ర కార్యదర్శి ఉదయబ్రహ్మం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో శాఖలు ఏర్పాటయ్యేలా నూతన జిల్లా కమిటీ కృషి చేయాలని, విద్యా ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాట పటిమతో ముందుకెళ్లాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పివిఎస్.రమణ మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన 11 వ పీఆర్సి బకాయిలతో పాటు, పీఎఫ్, ఏపీజిఎల్ఐ చెల్లింపులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లులను గత మూడు సంవత్సరాలుగా చెల్లించడం లేదని, సదరు చెల్లింపులకై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షులు ఓంప్రకాష్ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ రెండూ ఆమోదయోగ్యం కావని, ఉద్యోగఉపాధ్యాయులు కేవలం ఓపిఎస్ విధానాన్ని మాత్రమే కోరుకుంటున్నారని ప్రభుత్వం విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు తక్షణమే ఓపిఎస్‌ను వర్తింపచేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని, వారి కుటుంబాలకు ఆర్థికభద్రత కల్పించాలనన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సమావేశంలో నివాళులు అర్పించారు. భీమవరం రూరల్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుమలేశ్వరి, శ్రీవల్లి, నరసాపురం డివిజన్ కన్వీనర్ పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.3కోట్లతో తారు రోడ్డు నిర్మాణం పనులు

విశాలాంధ్ర - పాలకొల్లు : పోడూరు మండలం పోడూరు గ్రామం నుండి కవిటం వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శనివారం పోడూరు గ్రామంలో నిర్వహిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ సువర్ణ రాజు, వైసిపి నాయకులు చేకూరి సూరిబాబు, మండల వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు (చినబాబు), ఏఎంసి సభ్యులు గిరిబాబు, దేవస్థానం ప్రెసిడెంట్ సాయిబాబా, ఆర్ అండ్ బి ఏఈ మూర్తి తదితరులు పరిశీలించారు. రూ.3 కోట్ల వ్యయంతో గుమ్మలూరు నుండి పోడూరు, పోడూరు నుండి కవిటం వరకు రహదారిని నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు మండల ఉపాధ్యక్షులు ఇందుకూరి సీతారామ రాజు (చినబాబు) తెలిపారు.

జనసేన రాష్ట్ర ప్రచార విభాగం చైర్మన్‌గా వాసు

విశాలాంధ్ర - పాలకొల్లు : జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రచార విభాగం చైర్మన్ గా పాలకొల్లుకు చెందిన గవర ఉదయ శ్రీనివాస్ (బన్నీ వాసు) ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బన్నీ వాసు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన లోకల్ యాప్‌తో మాట్లాడుతూ జనసేన పార్టీని పటిష్ఠం చేసే విషయంలో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. పార్టీ అభివృద్ధికి అలుపెరగకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

శివస్వాములు పీఠం ఆధ్వర్యంలో వనసమారాధన

విశాలాంధ్ర-భీమడోలు: కార్తీకమాసం సందర్భంగా భీమడోలు గోదావరి కాలువ గట్టుపై ఉన్న శ్రీపార్వతి సమేత భీమేశ్వర శివ దీక్షాపీఠం వద్ద కార్తీకమాస వనభోజనాలను శివ మాలధారులు ఏర్పాటు చేసారు.ఆలయ గురుస్వామి పేరాబత్తుల వెంకటేశ్వరరావు, పీఠం నిర్వాహకులు ఆధ్వర్యంలో గ్రామస్తులు మూడువేల మందికి అన్నప్రసాదాన్ని శివస్వాములు ఏర్పాటుచేసారు. భీమడోలు, పరిసర గ్రామాల నుండి భక్తులు, అయ్యప్పమాలదారులు, భవానీ భక్తులు, శివస్వాములు భారీగా తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

విశాలాంధ్ర-వీరవాసరం: మండలంలోని తోలేరులో ప్రసిద్ధి చెందిన వల్లీదేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సం నేటి రాత్రి 7 గంటలకు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు చవ్వాకుల సత్యనారాయణ తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవ సభలో సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి, రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణలను సత్కరించనున్నట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర -భీమవరం: టిడిపి హయాంలో మారుమూల గ్రామాలకు సిమెంట్ రోడ్లు విద్యుత్, మంచినీటి సరఫరా నిర్మాణపు పనులు జరిగాయని వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి నిలిచి రాష్ట్రం అప్పుల పాలయ్యిం దని జిల్లా టిడిపి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ అన్నారు. భీమవరం మండలం కోవ్వాడ అన్నవరం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని రానున్న ఎన్నికలలో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి మెంటే గోపి, అల్లూరి సుబ్రహ్మణ్యరాజు, గ్రామ కమిటీ నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి మూర్తిరాజు కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - గణపవరం: విద్యా దాత, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు గ్రామీణ ప్రాంతంలో విద్య వ్యాప్తికి చేసిన కృషి వెలకట్టలేమని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. శనివారం మూర్తి రాజు 104 వ జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న మూర్తి రాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూర్తి రాజు ఆశయాలను విద్యార్థిని విద్యార్థులు అలవర్చుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి : తుఫాను వలన నష్టపోయిన ఎన్ఎల్ఎస్ పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరటూరి శ్రీనివాస్ కోరారు. దేవరపల్లిలో ఆయన మాట్లాడుతూ అకాల తుఫాను వలన మంచి ఎదుగుదల లో ఉన్న పొగాకు నేలకు ఒరిగిందని కొన్నిచోట్ల పొగాకు మొక్కలు మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది ఎకరాల్లో పొగాకు పంట నష్టపోయిందని అన్నారు. పొగాకు పంటకు రీ షెడ్యూలు లేదా అదనంగా రుణాలు ఇప్పించాలని ఆయన కోరారు. ఈ విషయంపై రాజమండ్రిలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జాయింట్ కలెక్టర్ తేజ్ భరతుకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాధవరావుకు లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌కు పొగాకు బోర్డు ఆర్ఎం ఆదిశేషయ్యకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి నివాళులు

విశాలాంధ్ర - చాగల్లు : ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఎమ్ ఎల్ సి షేక్ సాబ్జీ అకాల మృతికి సంతాప సూచికగా శనివారం చాగల్లు ఎమ్ ఆర్ సిలో మండల విద్యాశాఖాధికార్లు, ప్రధానోపాధ్యాయులు, యూటీఎఫ్ చాగల్లు మండల శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.ఈ కార్యక్ర మంలో మండల విద్యాశాఖాధికార్లు వి.ఖాదర్ బాబు,, సి హెచ్ శుభాకర్, ప్రధానోపాధ్యాయులు రమణ, నాగేశ్వరావు షేక్ అబ్దుల్ కరీం సూరిబాబు, కోటేశ్వరావు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి , అధ్యక్షులు జె. రాజశేఖర్ , ప్రధాన కార్యదర్శి రవి వర్మ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

విశాలాంధ్ర - చాగల్లు : పేదల ఆకలి తీర్చుటకు, వైద్యం అందించేందుకు, ఉపాధి చూపించుటకు, న్యాయం అందించుటకు మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తమ ప్రయత్నాలు ఎల్లపుడు ఉంటాయని ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు అన్నారు. సేవా కార్యక్ర మంలో భాగంగా శనివారం చాగల్లు మండలం నెలటూరు గ్రామంలో 10 నిరుపేద కుటుంబాలకు ఉచితంగా నాణ్యమైన బియ్యం 15 కేజీ లు చొప్పున గ్రామ నాయకులు గెడా శ్యాం కుమార్, రఘారావు, కొడమంచిలి పాప ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకా రంగారావు, అయినం సుబ్రమణ్యం, కేతావెంకటేశ్వరరావు, జోషి, మాణిక్యం,బోలిపో రమేష్, జొన్నకూటి బాబ్జి, వరిగేటి ధనరాజు, బి. శ్రీను, జె ప్రసాద్, కాగిత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర-గోపాలపురం : సుప్రీంకోర్టు సిఫార్సుల మేరకు అంగన్వాడీ కార్యకర్తలకు 26వేల రూపాయలు జీతం అమలు చేసి తన హామీని నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సవాల్ విసిరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్ల సమ్మె ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పాత్రికేయులతో సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎక్కువ శ్రమ దోపిడి తక్కువ జీతంతో పనిచేసే అంగన్వాడి కార్యకర్తల ఉద్యోగ భద్రత, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలంటూ పలు డిమాండ్లను ఆయన ప్రస్తావించారు. అనంతరం నల్ల రిబ్బన్లు నోటికి పట్టుకొని మౌన నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ల మండల అధ్యక్షురాలు ఎస్. రామలక్ష్మి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లకు ఉమ్మిడి మద్దతు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆదేశాలు మేరకు, మాజీ కేంద్ర మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యులు ఎంఎం పల్లంరాజు ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా ప్రతిపాడు మండల తహశీల్దార్ ఆఫీస్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మహా ధర్నా కార్యక్రమంలో ప్రతిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, ఆంధ్రప్రదేశ్ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ ఉమ్మిడి వెంకటరావు, పీసీసీ సభ్యులు ధర్నాలకోట శ్రీను పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకటరావు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ న్యాయమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలని, సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్రలో అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రొంగల ఈశ్వరరావు, జిల్లా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ మెంబర్ పోతబత్తుల పెద్దబాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కార్యక్రమాల సమన్వయకర్తగా పెందుర్తి

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తలపెట్టే కార్యక్రమాల సమన్వయకర్తగా పెందుర్తి వెంకటేష్ నియమితులైనట్లు పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. నియోజకవర్గ ఇన్చార్జిగా పెందుర్తి వెంకటేష్ రాజీనామాతో నియోజకవర్గ తెదేపా శ్రేణిలో అసంతృప్తి నెలకొంది.మరలా చంద్రబాబు నాయుడు నియోజకవర్గ ఇన్చార్జిగా బొడ్డు వెంకట రమణ చౌదరిని పరిచయం చేయడం,మాజీ శాసన సభ్యులు పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యంలో నియోజవర్గాన్ని కంచుకోటగా నిలపడానికి ఇరువురు నాయకులు కలిసి పని చేస్తారని చెప్పిన విషయం పాఠకులకు విదితమే. కొన్నాళ్లపాటు స్తబ్దతగా ఉన్న వెంకటేష్ బాబు కార్యక్రమాలలో సమన్వయకర్తగా వ్యవహరిస్తారని పార్టీ నుండి ఉత్తర్వులు వెలువడడంతో నియోజకవర్గ నాయకులలో మరింత జోష్ పెంచిందని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేష్ చంద్రబాబు కార్యక్రమాల సమన్వయకర్తగా నియామకం పట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి ఖండవిల్లి లక్ష్మి,వలవల రాజా, చిట్టూరి రంగారావుతో పాటు మూడు మండలాల తెలుగు తమ్ముళ్లు వెంకటేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

హెర్బాలైఫ్ ఇండియా, షులిని యూనివర్శిటీ ద్వారా డైరెక్ట్ సెల్లింగ్లో మేనేజ్మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర- పశ్చిమగోదావరి: గ్లోబల్ న్యూట్రిషన్ కంపెనీ హెర్బాలైఫ్ ఇండియా, హిమాచల్ ప్రదేశ్ సోలన్ లోని షులిని యూనివర్సిటీ ఆఫ్ బయో టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ తొలిసారిగా ఒక ఒప్పందంపై సంతకం చేసినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) కోర్సుల్లో డైరెక్ట్ సెల్లింగ్ అనే సబ్జెక్టును చేర్చేందుకు సంయుక్తంగా ముందడుగు వేశాయన్నారు.సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు హెర్బాలైఫ్ తో జరిగిన ఒప్పందంలో భాగంగా షులిని యూనివర్సిటీ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డైరెక్ట్ సెల్లింగ్ ఇన్ అకాడమిక్స్ (సీఈడీఎస్ఏ)ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ చొరవతో హిమాచల్ కు చెందిన ప్రముఖ యూనివర్సిటీలో బీబీఏ, ఎంబీఏ కోర్సుల్లో డైరెక్ట్ సెల్లింగ్ మేనేజ్ మెంట్ ఒక సబ్జెక్టు కావడం గమనార్హమన్నారు.ఈ మేరకు యూనివర్సిటీ యాజమాన్యం 2023-24 కొత్త అకాడమిక్ క్యాలెండర్‌లో ఈ కోర్సుకు సంబంధించిన వివరాలను పొందుపరనుందన్నారు. విద్యార్థులకు, వ్యాపారులుగా ఎదగాలని ఆశించే వారికి ఈ కోర్సు వల్ల అనేక లాభాలు జరుగుతాయని ఆశిస్తోంది అశా భావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మాత్ర మాత్రమే కాదు, భారత డైరెక్ట్ సెల్లింగ్ సెక్టార్‌కు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ హెర్బాలైఫ్ ఇండియా అజయ్ కన్నా వివరించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వాడపల్లి గ్రామంలోని స్వామివారి గోవింద స్వరాలతో మార్మోగిన చందన వెంకన్న క్షేత్రం. కోనసీమ తిరుమల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగ పద్మావతి సమేతంగా కొలువై ఉన్న వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్ర నలుదిక్కుల నుండి భక్తులు తరలివచ్చి ఏడువారాల వెంకన్నను దర్శించుకున్న దివ్య ఆశీస్సులు పొందుతున్నారు. దూర ప్రాంతాల నుండి కాలినడక నుండి వచ్చే భక్తులు శుక్రవారం సాయంత్రానికి ఆలయానికి చేరుకుని ఆలయ ప్రాకర మండపంలో సేద తీరుతున్నారు. శనివారం తెల్లవారుజామున గౌతమీ గోదావరిలో తల స్నానాలను ఆచరించి, మొక్కుబడులు చెల్లించుకునే భక్తులు తలనీలాలు స్వామి వారికి సమర్పించుకుని సంప్రదాయ వస్త్రధారణలతో స్వామివారి ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రతిక్షణాలు నిర్వహిస్తూ గోవిందా గోవిందా హరి గోవిందా, అనే నామస్వారాలతో ఆలయమంతా మారుమోగింది. స్వామివారి ఆలయ సన్నిధిలో ఐశ్వర్య లక్ష్మీ హోమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి సుప్రభాత సేవ మేలుకొలుపు సేవ, స్వామివారి పుష్పాలంకరణ అనంతరం స్వామివారి మొదటి హారతితో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏడువారాల నోము నోసుకొనే భక్తులు చందన వెంకటేశ్వర స్వామిని నిలువెత్తు స్వరూపాన్ని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ వద్ద శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఆత్రేయపురం ఎస్సై బి. కిరణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

22న హర్ష అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - అమలాపురం : అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామంలో హర్ష కుమార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 22న ఏర్పాటు చేశారు. ఈ మేరకు 4 గంటలకు పార్టీ లకు అతీతంగా ఈ సమా వేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపింది. సన్నాహక సమావేశం శనివారం అమలాపురం శుభ గృహలో నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా అందరికీ ఆహ్వానిస్తున్నామని హర్ష కుమార్ తెలిపారు. తాను ఎంపిగా పదేళ్లు పనిచేసి అన్ని వర్గాల ప్రజలకు సేవ చేశానన్నారు. 22న జరిగే ఆత్మీయ సమ్మేళనానికి అందరూ హాజరు కావాలని హర్షకుమార్ కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అంగన్వాడిల ఆగ్రహం

విశాలాంధ్ర - మామిడికుదురు : న్యాయ పరమైన డిమాండ్ల సాధనకై ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు ఉద్యమం ఉధృతమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంగన్వాడిలు ప్రభుత్వా నికి అల్టిమేటం జారీ చేశారు. శనివారం మామిడికుదురు మండలం అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి మామిడికుదురు సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల పెంచాలని, భీమ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు.

అంగన్వాడి కార్యకర్తలకు మద్దతుగా జనసేన పార్టీ

విశాలాంధ్ర - కాకినాడ : జనసేన పార్టీ కాకినాడ సిటిలో పిఏసి సభ్యులు & కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన ధర్నా శిబిరాన్ని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య సందర్శించారు. ఈసందర్భంగా తలాటం మాట్లాడుతూ అంగన్వాడి లకు మద్దతుగా తమ నాయకుడు పవన్ కళ్యాణ్ సందేశాన్ని వారికి అందచేసి తమ మద్దతుని ప్రకటించారు. ఓట్లు అడుక్కొంటున్న వేళ హామీల మీద హామీలు ఇచ్చి తీరా వారి అవసరం తీరిపోయాకా పూచికపుల్లలా తీసెయడం ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నైజం అని ప్రజలకు తేటతెల్లం అయ్యిందన్నారు. అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి కార్యాలయల తాళాలను బద్దలు కొట్టి జులూం ప్రదర్శించడం వారి అదుపులోకి తీసుకోవడం చాలా దారుణమనీ దీనికి ఫలితం తప్పకుండా ఈ జగన్మోహన్ రెడ్డి అనుభవిచాలన్నారు. అంగన్వాడీలకు తమ మద్దతుని పార్టీ పిఏసి సభ్యులు & కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ అందచేస్తారనీ, వెనకడుగు వేసే ప్రసక్తేలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, మండపాక దుర్గాప్రసాద్, దారపు సతీష్, దుర్గా శివకుమార్, చీకట్ల వాసు, బట్టు లీల, మిరియాల హైమావతి, బండి సుజాత, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై జగన్ కక్ష సాధింపు తగదు

విశాలాంధ్ర - రాజోలు : అంగన్వాడి ఉద్యోగులపై వైసీపీ ప్రభుత్వం ఉక్కు పాదం మోపడం అన్యాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఆవేద వ్యక్తం చేశారు. రాజోలులో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నిర్వహించిన ర్యాలీలో, ఆయన పాల్గొని మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమని ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై కక్ష గట్టి ఉక్కుపాదం మోపడం జగన్ రెడ్డి నిరంకుశ, పెట్టుబడిదారీ విధానాలకు నిదర్శనమన్నారు. అంగన్వాడీ ఉద్యోగులుచేసిన తప్పేంటని తనను మించిన మహిళా పక్షపాతి ఎవరూ లేరంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు దంచికొట్టి జగన్ అంగన్వాడీలపై లాఠీచార్జ్, అక్రమ అరెస్టు, నిర్బంధాలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. తెలంగాణ కంటే ఎక్కువ జీతాలు ఇస్తానని మాయ మాటలు చెప్పి అధికారంలోకి రాగానే మాట తప్పిన జగన్‌ని అంగన్వాడీలు ప్రశ్నించడం తప్పెలా అవుతుందని అంగన్వాడీలకు జీతాల పెంచిన ఘనత చంద్రన్న కే దక్కుతుంది అన్నారు. అంగన్వాడి భవనాల తాళాలు పగలగొట్టడం, అంగన్వాడి కేంద్రాల్లో సచివాలయ సిబ్బంది చేస్తున్న ఆగడాలను ఆయన ఖండించారు. కే సుజాత మాట్లాడుతూ పనికి తగినంత జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అంగన్వాడీలు ఒళ్ళు బలిసి సమ్మె చేస్తున్నారన్న మాటలను సీఎం జగన్మోహన్ రెడ్డి ఖండించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కే రత్నకుమారి, కే సుభద్ర, రత్నకుమారి, వరలక్ష్మి, ప్రకాషమ్మ పటేల్ పాల్గొన్నారు.